మాట్లాడుతున్న కిరణ్ అబ్బవరం

ఆదిత్యుని చిత్రపటం అందుకుంటున్న సినీ నటుడు

కరకట్టరా'?

- 2007లో మొదలైన పనులు
- 15 ఏళ్లుగడుస్తున్నా ఎక్కడి పనులు అక్కడే
- ప్రాధాన్యత పనులపై పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఏడాదిన్నర గడుస్తున్నా నేటికి ఆమోదం తెలపని వైనం

15 ఏళ్ల క్రితం ప్రారంభమైన వంశధార, నాగావళి కరకట్టల నిర్మాణ పనులు నేటికీ ఒక కొలిక్కి రాలేదు. అధికార మార్పిడి జరుగుతున్న ప్రతి సందర్భంలోనూ నిర్మాణ సంస్థలు మారడటంతో కరకట్టల కథ మళ్లీ మొదటికే వస్తోంది. 2007లో కాంగ్రెస్ పార్టీ హయాంలో మొదలైన పనులు ఏ దశలో నిలిచిపోయాయో అదే స్థితిలో ఉన్నాయి. టిడిపి ప్రభుత్వం కొత్త నిర్మాణ సంస్థలకు పనులు అప్పగించడం, అంచనా వ్యయం పెంపు ప్రతిపాదనలకు ఆమోదం తెలపడంతోనే సరిపెట్టింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం తొలుత వరద ముప్ప తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలని ఆదేశించింది. ప్రభుత్వ సూచనలకనుగుణంగా 2021 మేలో అధికారులు ప్రతిపాదనలు పంపినా నేటికీ ఆమోదం తెలపలేదు. వేసవి నేపథ్యంలో పనులు చేపట్టేందుకు అనువైన కాలం కావడంతో ప్రభుత్వం అనుమతి కోసం అధికారులు వేచిచూస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార నదిపై నిర్మించాల్సిన కరకట్టలను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ పనిని 2007 ప్రారంభంలో రూ.44.77కోట్లతో ప్రారంభించారు. 2010 జూన్ నాటికి సంబంధిత నిర్మాణ సంస్థ ఏడు శాతం మాత్రమే పనిచేసి నిలుపుదల చేసింది. ప్యాకేజీ-2 పనులను అదే సంస్థ రూ.27.29 కోట్లతో పనులను దక్కించుకుంది. పనులను 2007లో ప్రారంభించి, 2011 మార్చి నాటికి 5.66 శాతం పనులను పూర్తి చేసి మిగిలిన పనిని చేయలేమంటూ చేతులెత్తేసింది. ప్యాకేజీ-3 పనులను కూడా 2007 ప్రారంభంలో రూ.49.16 కోట్లతో ప్రారంభించారు. 2010 జులై నాటికి 2.45శాతం పనులు పూర్తి చేసి, అర్ధాంతరంగా విడిచిపెట్టేసింది. మూడు ప్యాకేజీలకు ఒకే నిర్మాణ సంస్థ పని దక్కించుకోగా, ప్యాకేజీ-4 పనులను వేరే నిర్మాణ సంస్థ చేజిక్కుంచుకుంది. 2009లో రూ.56.60 కోట్లకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ 21.34 శాతం పనులు పూర్తి చేసి అర్ధాంతరంగా విడిచిపెట్టేసింది. ఆయా నిర్మాణ సంస్థలు ఎంత మేర పనులు చేసి ఆపేశాయో అక్కడ నుంచి నేటి వరకు అదనంగా ఒక్క శాతం పనులు కూడా జరగలేదు. కరకట్టల నిర్మాణానికి పెద్ద ఎత్తున భూమిని సేకరించాల్సి ఉండటం, భూసేకరణకు అధికంగా నిధులు వెచ్చించాల్సి రావడంతో ప్రభుత్వం ఉన్న పళంగా కరకట్టలను ఆపేసింది.

జలుమూరు మండలంలో అర్ధాంతరంగా నిలిచిన కరకట్టల పనులు

నాగావళి కరకట్టల పనులూ నిలిపివేత

నాగావళి నదిపై నిర్మిస్తున్న కరకట్టలు కూడా అసంపూర్తిగానే ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలో నిర్మిస్తున్న కరకట్టలను ప్యాకేజీగా పనులుగా చేపడుతున్నారు. హైదరాబాద్‌కు చెందిన గాయత్రి ప్రాజెక్ట్స్ సంస్థ రూ.61.45 కోట్లకు పనులను దక్కించుకుంది. 2008లోనే పనులను ప్రారంభించింది. ఇప్పటికి కూడా పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. జిల్లా పరిధిలో 51.88 కిలోమీటర్ల మేర వరద కట్ట నిర్మించాల్సి ఉండగా ఇప్పటివరకు 17.29 కి॥మీ పొడవు మేర మాత్రమే పని పూర్తయింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 25 శాతం కంటే తక్కువ ఖర్చు చేసి పనులను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ మే 29, 2019న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికారులు ఎక్కడి పనులను అక్కడే నిలిపేశారు.

అధికార మార్పిడి జరిగినప్పడల్లా నిర్మాణ సంస్థల మార్పు

వంశధార, నాగావళి కరకట్టల పనులు 2007-08లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రారంభమయ్యాయి. వంశధార కరకట్టలకు సంబంధించి నాలుగు ప్యాకేజీల పనులు 5.66 శాతం నుంచి 21.34 శాతం మాత్రమే పూర్తయ్యాయి. నాగావళి కరకట్టల పనులు 33.32 శాతం పూర్తయ్యాయి. నిర్మాణ సంస్థలు 2010 నుంచి పనులను ఆపేసాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం కొత్తగా టెండర్లను పిలిచి కొత్త నిర్మాణ సంస్థలకు పనులను అప్పగించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఉన్న పళంగా పనులను నిలిపేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

ప్రాధాన్యతా పనులకూ ఆమోదం తెలపని ప్రభుత్వం

వంశధార, నాగావళి నదుల వరదల నుంచి అధిగమించడానికి గతంలో కరకట్టల పనులను ప్రారంభించినా ఫలితం లేకపోయింది. 2009-10 మధ్య కాలం వరకు కాస్తాకూస్తో పనులు జరిగినా ఆ తర్వాత నుంచి ఒక్క అడుగు కూడా ముందుకు పడటం లేదు.

2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 25శాతంలోపు ఖర్చయిన పనులను నిలిపేసి వరద ముప్పు తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలంటూ అధికారులను ఆదేశించింది. ముంపు తీవ్రత అధికంగా ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యమివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో నాగావళి కరకట్టలకు సంబంధించి అధికారులు తొలుత ఐదు ప్రాంతాలను గుర్తించారు. వాటిలో కరకట్టల నిర్మాణానికి రూ.119 కోట్లు అవసరం అవుతాయని అధికారులు ప్రాతిపాదించారు. అదే విధంగా వంశధారపై 22.77 కి.మీ మేర కరకట్టలను నిర్మించేందుకు రూ.126 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నాగవాళి, వంశధార నదులపై వరద ముంపు తీవ్రంగా ఉన్న ప్రాంతాలపై ప్రతిపాదనలు పంపి ఏడాదన్నర గడుస్తున్నా ప్రభుత్వం నేటికీ ఆమోదం తెలపలేదు.

యువతను ఆకట్టుకునే కథలు రావాలి

సినీ నటుడు కిరణ్ అబ్బవరం

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

యువతను ఆకట్టుకునే విధంగా కథలు తీసుకురావడంలో యువ దర్శకులు ప్రత్యేకత చాటుకుంటున్నారని వర్ధమాన సినీ నటుడు కిరణ్ అబ్బవరం అన్నారు. శ్రీకాకుళం ఎస్‌విసిలో 'వినరో భాగ్యము విష్ణు కథ' సినిమా ప్రమోషన్‌లో భాగంగా వచ్చిన ఆయన ముందుగా ప్రేక్షకులకు అభివాదం తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుత చలన చిత్రరంగం యువతపైనే ఆధారపడి ఉందని, ప్రస్తుత ట్రెండ్‌కు సరిపడే విధంగా చలనచిత్ర నిర్మాణం జరిగితే కచ్చితంగా విజయం సాధిస్తామని అన్నారు. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ నిర్మించే ఈ చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందుతుందని, మంచి కథాంశంతో నిర్మించినట్లు చెప్పారు. యువ దర్శకుడు డోల ఆశారాజు దర్శకత్వం వహించిన 'దూరం' ఆల్బమ్ సాంగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆశా రాజును కిరణ్ అభినందించారు. మరిన్ని మంచి ఆల్బమ్స్ తయారు చేయాలని, యువతకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌విసి థియేటర్ మేనేజర్ రవి, డోల అప్పన్న, చింతపల్లి నాగభూషణరావు, టెంక శ్రీను, తిత్తి ప్రవీణ్, వాసు తదితరులు పాల్గొన్నారు

ఆదిత్యుని సన్నిధిలో..

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని వర్ధమాన నటుడు కిరణ్ అబ్బవరం సందర్శించారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా శ్రీకాకుళం వచ్చిన ఆయన ముందుగా సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. స్వామి వారి సేవల అనంతరం అనివేటి మండపంలో ఆలయ సీనియర్ సహాయకులు బిఎస్ చక్రవర్తి జ్ఞాపికను అందజేశారు.

జీడి, టేకు తోటలు దగ్ధం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని ఎగువజాడుపల్లి సమీపంలో జీడి, టేకు తోటల్లో బుధవారం అగ్ని మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో సూర్జిని ఆదమ్మ, అంకుడు రంగారావు రైతులకు సంబంధించి ఐదెకరాల జీడి, టేకు తోటలు దగ్ధమైంది. పూతకు వచ్చే సమయంలో ఇలా అగ్ని ప్రమాదానికి గురవడంతో బాధిత రైతులు ఆవేదన చెందుతున్నారు. సమాచారం అందుకున్న పలాస అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. సంఘటనా స్థలాన్ని సర్పంచ్ ప్రతినిధి కన్నబాబు, ఎంపిటిసి ప్రతినిధి కదంబల రాజు, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

దగ్ధమవుతున్న జీడి తోట

టోల్‌ప్లాజా కార్మికులకు
ఉపాధి కల్పించాలి

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్
- ఎన్‌హెచ్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రోడ్డున పడ్డ చిలకపాలెం టోల్ ప్లాజా కార్మికలకు వెంటనే ఉపాధి కల్పించి ఆదుకోవాలని, లేకపోతే ప్రభుత్వ యంత్రాంగాన్ని దిగ్బంధిస్థామని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కె.ఎస్‌వి.కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు హెచ్చరించారు. చిలకపాలెం టోల్ ప్లాజా ఎత్తి వేయడంతో 2007 నుంచి పనిచేస్తున్న 106 మంది కార్మికులకు మడపాం, నాతవలస టోల్ ప్లాజాల్లో వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని, రోడ్డున పడ్డ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన విశాఖపట్నంలోని హనుమంతవాక వద్ద ఉన్న నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టోల్ ప్లాజా ఎత్తివేయడంతో కార్మికులు రోడ్డున పడ్డారని అన్నారు. రెండు టోల్ ప్లాజాల్లో సర్దుబాటు చేసి, వీరిని విధుల్లో కొనసాగించాలని, గ్రాట్యూటీ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రోడ్డున పడ్డ కార్మికులను ఆదుకోవాలని, కార్మికుల సమస్య పరిష్కరించాలని కోరుతూ అధికారులు, స్పీకర్, రెవెన్యూ మంత్రి, ప్రజా ప్రతినిధులను కలిసి విన్నవించినా నేటికీ ప్రభుత్వంలో చలనం లేదని విమర్శించారు.

కార్మికులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అర్ధాంతరంగా కార్మికులను రోడ్డున పడేస్తే వారి కుటుంబాలు ఏ విధంగా బతకాలని, వారి పిల్లల స్కూల్ ఫీజులు ఏ విధంగా చెల్లించాలని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నేషనల్ హైవే పిడీ శివశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, చిలకపాలెం టోల్ ప్లాజా ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డి.వి.నర్సింహులు, వి.వెంకటరమణ, ఎ.వి.ఆర్.మూర్తి, టి.అప్పారావు, పి.రాము, బి.రాజేశ్వరరావు, మురళీ, శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న టోల్‌ప్లాజా కార్మికులు

ఇంటికి చేర్చిన యూట్యూబ్

- నాలుగేళ్ల తరువాత గ్రామానికి వచ్చిన కామరాజు
- యూట్యూబర్ మాలిని సన్మానించిన గ్రామస్తులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

బట్టలు మాసిపోయాయి. జుత్తు జడలు కట్టింది. తన పేరు తప్ప, ఇంకేమి చెప్పలేని అమాయకుడు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన యూట్యూబర్ మాలి దీన్ని చూసి చలించిపోయాడు. ఓ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న ఆ వ్యక్తిని తనతో పాటు షెలూన్ షాపుకు తీసుకెళ్లి తల నీలాలు తీయించాడు. స్నానం చేయించి, కొత్త దుస్తులు ఇచ్చాడు. మంచి భోజనం పెట్టించాడు. ఆయన తన యూట్యూబ్ ఛానల్ 'మళ్లి మళ్లి 123'లో ఆ వీడియోను అప్‌లోడ్ చేశాడు. ఆ ఛానల్‌ను ఫాలో అవుతున్న గేదెలవానిపేటకు చెందిన సాధు అప్పలనాయుడు ఆ వీడియోను చూశాడు. నాలుగేళ్లుగా కనిపించకుండా పోయిన కామరాజుగా గుర్తించాడు. పూర్తి వివరాలిలా ఉన్నాయి.

యూట్యూబర్ మాలిని సన్మానిస్తున్న గ్రామ ప్రజలు

ఆమదాలవలస మున్సిపాలిటీ నాలుగో వార్డు గేదెలవానిపేటకు చెందిన సాధు కామరాజు(42) నాలుగేళ్ల క్రితం తాపీ పని కోసం స్వగ్రామానికి చెందిన వారితో తిరుపతి కూలి పనులకు వెళ్లాడు. మార్గం మధ్యలో నెల్లూరులో రైలు దిగిపోయాడు. ఆయన అమాయకత్వం కారణంగా ఊరు పేరు చెప్పలేని పరిస్థితిలో ఉండటంతో అక్కడే ఉండిపోయాడు. గేదెలవానిపేట గ్రామ ప్రజలు ఆయన ఆచూకీ కోసం ఎంత వెతికినప్పటికీ అతని ఆచూకీ దొరకలేదు. చివరకు కోవిడ్ మొదటి, రెండవ దశలో చనిపోయి ఉంటాడని భావించారు. నాలుగేళ్లు కావడంతో కామరాజును అందరూ మరిచిపోయారు. నాలుగేళ్ల తరువాత నెల్లూరు జిల్లా కావలికి చెందిన యూట్యూబర్ మాలి ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న ఓ వ్యక్తిని చూసి చలించిపోయాడు. ఆయనను ఆదరించిన వీడియోను 'మళ్లి మళ్లి 123' యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేశాడు. ఈ వీడియో చూసిన అప్పలరాజు మాలిని సంప్రదించాడు. ఆయన కనిపించకుండా పోయిన కామరాజు అని, ఆయనది మా గ్రామమే అని చెప్పాడు. మాలి ఆయన మాటలను నమ్మలేదు. దీంతో కుటుంబసభ్యులు కామరాజు ఫొటోలను వాట్సాప్‌లో షేర్ చేశారు. మాలికి నమ్మకం కలిగి కామరాజును గ్రామానికి తీసుకువచ్చారు. కామరాజుకు తల్లి, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య నాలుగున్నరేళ్ల క్రితమే చనిపోయింది.

మాలికి సన్మానం

యూట్యూబర్ మాలి కామరాజను గ్రామానికి బుధవారం తెచ్చి, కుటుంబసభ్యులకు అప్పగించాడు. చనిపోయాడనుకొన్న వ్యక్తిని ఇంటికి తీసుకొచ్చిన మాలిని కుటుంబసభ్యులు అభినందించారు. మీ రుణం ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదని ఆనందపరవశమయ్యారు. హరే రామ నగర సంకీర్తన సభ్యుల సమక్షంలో కుటుంబసభ్యులు, గ్రామస్తులు, గ్రామ గ్రీన్ యూత్ ఆనంద సన్మాన సభను ఏర్పాటు చేశారు. మాలిని ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో గ్రీన్ యూత్ సభ్యులు సాధు మధుసూదనరావు, బగ్గ నరసింహులు, పసగాడ గోవిందరావు, నక్క అశోక్, బాలసుందరరావు తదితరులు పాల్గొన్నారు.



సాధు కామరాజు(ఫైల్)

చనిపోయాడని అనుకున్నా

కామరాజు తిరిగి రావడం నమ్మలేకపోతున్నాను. నాలుగేళ్ల క్రితం ఇంటి నుంచి పని కోసం వెళ్లి తప్పిపోయాడు. కరోనా సమయంలో చనిపోయాడని భావించాం. తల్లి లేని పిల్లలను నాలుగేళ్లుగా కంటికి రెప్పలా పెంచుతున్నాను. తిరిగి ఇన్నాళ్లకు నా కొడుకు ఇంటికి రావడం చాలా ఆనందంగా ఉంది.

-సాధు, శ్రవణమ్మ,
కామరాజు తల్లి, గేదెలవానిపేట

ఇఎంయు రైలు పున: ప్రారంభం

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

విశాఖపట్నం-పలాస ఇఎంయు పాసింజర్ రైలు సేవలను సద్వినియోగించుకోవాలని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. కరోనా కారణంగా ఈఎంయును రైల్వే అధికారులు నిలిపివేశారు. కరోనా తగ్గుముఖం పట్టి, సాధారణ పరిస్థితులు వచ్చినా ఈ రైలును పునరుద్ధరించకపోవడంతో నిత్యం రాకపోకలు సాగించే ఉద్యోగులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలు ఎంపీ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి రైల్వే అధికారులతో మాట్లాడి, రైలును పునరుద్ధరించారు. దీంతో బుధవారం పొందూరు రైల్వే స్టేషన్‌లో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్‌తో కలిసి ఎంపీ ఈ రైలును పున: ప్రారంభించారు. శ్రీకాకుళం రోడ్డు, వజ్రపుకొత్తూరు మండలం పూండి, పలాస రైల్వే స్టేషన్లలో ఆగిన ఈఎంయుకు టిడిపి, వైసిపి నాయకులు ఘన స్వాగతం పలికారు.

పొందూరు రైల్వే స్టేషన్‌లో ప్రశాంతి, ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేయాలని, రైల్వే స్టేషన్ పక్కన ఉన్న లుట్టపేట, యాగాటి పేదలకు రహదారి సౌకర్యం కల్పించాలని ఎంపీకి స్థానికులు వినతిపత్రాలు ఇచ్చారు. పలాస మండలం నర్సిపురం నుంచి కాశీబుగ్గ వచ్చే కాలిబాట రైల్వే వంతెన తెరిపించేందుకు రైల్వే అధికారులతో చర్చించి సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు ఎంపీని కోరారు.

ఇఎంయును ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని, రైల్వే స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని రైల్వేశాఖ మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఎంపీ చెప్పారు. శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్‌లో 30 సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు ఆగకుండా వెళ్లిపోతున్నాయని, ఎనిమిది రైళ్లను నిలుపుదల చేయాలని కూన రవికుమార్‌తో కలిసి రైల్వే డిఆర్‌ఎంను కలిశామని ఎంపీ చెప్పారు. అరకొర నిధులు కేటాయించడం కాకుండా అదనంగా నిధులు కేటాయించి వీలైనంత తొందరగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌ను అమల్లోకి తీసుకురావాలని కోరామని తెలిపారు.

రైలు పున: ప్రారంభం సందర్భంగా నమస్కరిస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

కార్యక్రమంలో పొందూరులో అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ సర్కార్, ఎస్‌ఎం జి.రామకృష్ణ, మండల అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహన్, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, సీపాన శ్రీరంగనాయకులు, చింతాడ కృష్ణవాసుదేవరావు, ఆమదాలవలసకు చెందిన టిడిపి నాయకులు మెండ దాసునాయుడు, బోర గోవిందరావు, బి.వి.రమణమూర్తి, గొండు రమణ, పలాస నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, పి.విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, కృష్ణారావు, రవిశంకర్, లక్ష్మణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఈఎంయుకు స్వాగతం పలికిన వైసిపి నాయకులు

పూండి రైల్వే స్టేషన్‌కు వచ్చిన ఇఎంయు రైలుకు వైసిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. లోకోపైలట్స్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి, అభినందనలు తెలిపారు. జెడ్‌పి చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు ఆధ్వర్యాన మంత్రి సీదిరి అప్పలరాజుకు సమస్యను వివరించామని, ఆయన సిఫార్సుతో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్‌ను, విశాఖపట్టణం రైల్వే డివిజన్ మేనేజర్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందించినట్లు చెప్పారు. ఎంపీ విజయసాయిరెడ్డి కృషితో ఈఎంయుని రైల్వే అధికారులు ప్రారంభించడంపై వైసిపి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు పాలిన ఉమామహేశ్వరరావు, హేమారావు, కొండఊరు సర్పంచ్ కె.భాస్కరరావు, పాత టెక్కలి సర్పంచ్ తుంగాన సుశీల, సైనూరు సర్పంచ్ అట్టాడ గోపి, చిరంజీవి, చింత రాజు, కణితి భగవాన్, మెట్ట వెంకటరావు, దొక్కరి మోహనరావు, జానకి, వసంతస్వామి, రమణ, గోవింద, పాపారావు, సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి - పలాస

స్థానిక జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఏడుగురు విద్యార్థులు బుధవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. వారిని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించచారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జ్యోతిరావు పూలే పాఠశాలలో 202 మంది విద్యార్థులు చదువుతున్నారు. బుధవారం మధ్యాహ్నం విద్యార్థినులకు అన్నంతోపాటు చికెన్ వడ్డించారు. రాత్రి అన్నం, క్యాబేజీ పువ్వుతో భోజనం పెట్టారు. 8గంటల సమయంలో విద్యార్థులు నిద్రకు ఉపక్రమించారు. ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రవళిక, టి.రాణి, తనుశ్రీ, పల్లవి, కీర్తన, శోభ, సుప్రియకు వాంతులు అయ్యాయి. ఊపిరి ఆడకపోవడం, తలనొప్పి, కళ్లు తిరగడంతో వసతి గృహ ప్రిన్సిపాల్ విద్యాధరరావు వారిని ఆటోలో పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రిన్సిపాల్ విద్యాధరరావు మాట్లాడుతూ విద్యార్థినులు ఎక్కువగా ట్యాబ్ చూడటం, అందులో చదవడం వల్లే ఇలా జరిగిందని చెప్పడం గమనార్హం. ప్రభుత్వ వైద్యులు విద్యార్థులకు వైద్య సేవలు అందించారు. వారి ప్రాణానికి ఎటువంటి హాని లేదని, బాగానే ఉన్నారని అన్నారు. సంబంధిత డాక్టర్ వచ్చి పరిశీలించాకే అస్వస్థతకు కారణం తెలుస్తుందని డ్యూటీ డాక్టర్ పాపినాయుడు తెలిపారు.

చికిత్స పొందుతున్న విద్యార్థినులు

సంక్షేమ పథకాలపై చర్చకు సిద్ధమా?

ఎమ్మెల్సీ శ్రీనివాస్ సవాల్

ఎమ్మెల్సీ శ్రీనివాస్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో సంక్షేమ పథకాలు అందన వారు ఎవరైనా ఉన్నారా ఉంటే బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయిడుకు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సవాల్ విశారు. టెక్కలి వైసిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. నిమ్మాడలో 122 ఇళ్లు, 70 పింఛన్లు వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఇచ్చామని పేర్కొన్నారు. మీ ఊరును నీకు బాగుచేసుకోవడం చేతకాక విమర్శలు చేయడం మంచిది కాదని సూచించారు. టిడిపి ప్రభుత్వంలో నాయకులు కార్యకర్తలు జోబిల్లో వేసుకున్నారని ఆరోపించారు. ఎక్కడైనా వైసిపి కార్యకర్తలు గాని, నాయకులు గాని లంచం తీసుకున్నారని చెప్పగలరా? అని ప్రశ్నించారు. ప్రతి ధాన్యం బస్తానూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు.

ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

నవధాన్యాల సాగుపై అవగాహన

ప్రజాశక్తి- రణస్థలం

నవ ధాన్యాలు సాగుతో నేలతల్లి బాగుంటుందని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ రైతులకు పిలుపునిచ్చారు. మండలంలోని రావాడలో నవధాన్యాలు అభియాన్ రైతుల సమక్షంలో బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పలు పంటల విధానం అవలంబించడం వల్ల మిత్ర పురుగులను అభివృద్ధి చేయవచ్చునని అన్నారు. ఖరీఫ్‌లో ప్రధాన పంట వరి వేసే ముందు నవధాన్యాలను సుమారుగా 30 రకాల విత్తనాలను ఎకరానికి 12 కిలోల చొప్పున వేసి నలభై ఐదు రోజులు బాగా పెరగనివ్వాలన్నారు. ఆ తరువాత ఆ వచ్చే పంటను పశువుల మేతగాను, మల్చింగ్ గాను, మిగిలిన వాటిని నేలలో కలియ దున్నానని తెలిపారు. దీనివల్ల ప్రధాన పంటకు కావాల్సిన పోషకాకాలను నేలలో సమృద్ధిగా అభివృద్ధి చేయవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలివరపు శివశంకర్, పట్నాన సత్యనారాయణ, గంట్యాడ ఏసుబాబు, రమణమ్మ, సూర్యం, లంక సుజాత పాల్గొన్నారు.

రేపు 'ఓపెన్ డే'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కళాశాల విద్య కమిషనర్ వారి ఆదేశాల మేరకు ఈ నెల 17న ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ పురుషుల ఆర్ట్స్ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రవేశాల పెంపుదలకు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలలో సౌకర్యాలు, వసతులు, వివిధ రకాల నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు, నిష్ణాతులైన అధ్యాపక సిబ్బంది అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు కళాశాలను ప్రత్యక్షంగా సందర్శించి అవగాహన పొంచుకోవాలన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు

ప్రజాశక్తి- అమరావతి

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్‌రెడ్డిని ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు కోరారు. వెలగపూడిలోని సచివాలయంలో ఆయనను బుధవారం కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉదోద్యగులకు బదిలీ ప్రక్రియ అమలు చేయాలని, టార్గెట్ల రూపంలో ఉద్యోగులపై మోపుతున్న అదనపు పని భారం లేకుండా చూడాలని, పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-5 వారికి వెంటనే జిఒ 149 ప్రకారం డిడిఒ అధికారులు కల్పించి, ఒక పంచాయతీ ఒక పంచాయతీ కార్యదర్శి అనే నినాదానికి వెనువంటనే శ్రీకారం చుట్టాలి అని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయాల్లో పని చేస్తూ కొత్తగా ఏర్పడిన నగర పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో విలీనమైన వారికి సంబంధించి సర్వీస్ రూల్స్ సక్రమంగా లేక వారు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మహిళా ఉద్యోగులు ప్రొహిబేషన్ కాలంలో తీసుకున్న మెటర్నిటీ లీవ్‌లను రెగ్యులర్ సర్వీస్‌లో భాగంగా పరిగణించాలని జవహర్‌రెడ్డిని కోరారు. రెవెన్యూ శాఖలో చిరు ఉద్యోగులైన విఆర్‌ఎలకు డిఎ పునరుద్ధరించాలని, ఫేషియల్ హాజరును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంబంధిత అధికారులతో చర్చించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. తొలుత జవహర్‌రెడ్డిని దుశ్శాలువతో సత్కరించారు. వినతిపత్రం అందించిన వారిలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు వి.అర్లయ్య, జనరల్ సెక్రటరీ సీపాన గోవిందరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతి, రాష్ట్ర కోశాధికారి బి.జగదీష్, తదితరులు ఉన్నారు.

సిఎస్‌ను సత్కరిస్తున్న బొప్పరాజు, తదితరులు

ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి- సోంపేట

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి చాణిక్య డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ప్రతినెలా 1న జీతాలు చెల్లించాలన్నారు. సర్దుబాటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించకపోతే ఆందోళనలో ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గోవిందరావు, తిరుపతిరావు, రాజేష్, దుర్యోధన, చక్రధర్, చంద్రశేఖర్, రమణ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బి.ఢిల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేయాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, జిపిఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఎయిడెడ్, మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షులు కె.కృష్ణమూర్తి, మండలశాఖ అధ్యక్షులు టి.కామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.జీవన్‌రావు, సిహెచ్.ఆదినారాయణ, రామారావు పాల్గొన్నారు.

సోంపేట : ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

యువ టూరిజం క్లబ్‌తో పర్యాటకాభివృద్ధి

పర్యాటక శాఖ అధికారి నారాయణరావు

మాట్లాడుతున్న నారాయణరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ ఆదేశాలను అనుసరించి జిల్లా వ్యాప్తంగా పర్యాటకశాఖ యువ టూరిజం క్లబ్‌ల ఏర్పాటు చేస్తున్నట్టు పర్యాటక శాఖ జిల్లా అధికారి ఎన్.నారాయణరావు తెలిపారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యాన యువ టూరిజం క్లబ్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లబ్‌లు జిల్లాలోని పర్యాటక ప్రదేశాల గురించి మరింత ప్రచారం చేయడంలో భాగస్వాములు కావాలన్నారు. క్లబ్ సభ్యులకు జిల్లాలోని పర్యాటక ప్రదేశాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన శిక్షణ అందిస్తామని అన్నారు. టూరిజం కౌన్సిల్ సభ్యులు యార్లగడ్డ గీతాశ్రీకాంత్ మాట్లాడుతూ తర్ఫీదు పొందిన క్లబ్‌సభ్యులు, తదుపరి టూరిజం ద్వారా ఉపాధి పొందే అవకాశం ఉందన్నారు. ఇలాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యాన మంత్రిత్వశాఖ శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఇంటాక్ అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, నెహ్రూ యువ కేంద్ర అధికారి వెంకట్ ఉజ్వల్, సెట్‌శ్రీ మేనేజర్ అప్పలనాయుడు, ఎన్.చిన్నారావు, చరిత్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : పురపాలక సంఘం పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి టౌన్ వన్ ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కాళింగ మన్నయ్యపేట, తెలగమన్నయ్య పేట, తురకపేట, చిట్టెమ్మ రైస్‌మిల్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని చెప్పారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలు గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.



సైనికుడిని సన్మానిస్తున్న గ్రీన్ ఆర్మీ సభ్యులు

ఆర్మీ ఉద్యోగికి సన్మానం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గకు చెందిన గోకినేని చిన్నారావు ఇండియన్ ఆర్మీలో 23 ఏళ్లుగా విధులు నిర్వర్తించి ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు బుధవారం స్వగ్రామానికి చేరుకున్నారు. దీంతో గ్రీన్ ఆర్మీ సభ్యులు ఘనస్వాగతం పలికి దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు భోనెల గోపాల్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తీ మూడు అంశాలు నెమరు వేసుకోవాలన్నారు. సమాజానికి మేలు చేసే రైతు, దేశానికి సేవ చేసే సైనికుడు, మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను మనందరం రుణపడి ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రోణంకి శాంతికుమారి, గ్రీన్ ఆర్మీ కార్యదర్శి బి.టి.రావు, గౌరవ అధ్యక్షుడు, ఉపాధ్యాయులు బత్తిని ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి బాలుడు మృతి

హేమంత్ (ఫైల్)

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని పెద్ద తామరపల్లికి చెందిన త్రినాథరావు కుమారుడు హేమంత్ దత్త (6) చెరువులో పడి మృతి చెందాడు. బుధవారం మధ్యాహ్నం ఎవరికీ చెప్పకుండా బహిర్భూమి కోసం చెరువుకు వెళ్లి జారి పడ్డాడు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. ఎప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎక్కడకు వెళ్లాడా అని ఆతృతతో తమ సమీప గ్రామాల్లోనూ, బంధువుల ఇళ్లలోనూ గాలించారు. ఎక్కడా ఆచూకీ లభించలేదు. గురువారం మధ్యాహ్నం చెరువు వైపు వెళ్లిన కొందరు చెరువులో తేలి ఆడితున్న బాలుని మృతదేహం చూసే తల్లిదండ్రులకు, గ్రామస్తులకు సమాచారం అందించారు. అందరూ చేరి మృతదేహాన్ని చూసి ఒక్కసారిగా కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు చెరువు వద్దకు చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీసి శవపంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి సోదరి అక్షయ ఉన్నారు. ఒక్కనొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

పరామర్శిస్తున్న మంత్రి అప్పలరాజు

కౌన్సిలర్‌కు మాతృవియోగం

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 9వ వార్డు కౌన్సిలర్ గుజ్జు జోగారావు తల్లి గుజ్జు దమయంతి (80) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చైర్మన్ బల్ల గిరిబాబు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వీరితో పాటు పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీశంకర్, డబ్బీరు నాగు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, బి.కృష్ణారావు, విప్ విప్ దుర్గాశంకర్ పండా, టిడిపి నాయకులు గాలి కృష్ణారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కన్వీనర్లు

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి- రణస్థలం

ఎచ్చెర్ల నియోజకవర్గం వైసిపి సోషల్ మీడియా కన్వీనర్లు, కో-కన్వీనర్లను నియమిస్తూ ఇటీవల పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. లావేరు మండలం సోషల్ మీడియా కన్వీనర్‌గా రెడ్డి రమణ, కో-కన్వీనర్లుగా సుంకర రాహుల్, మీసాల జగన్, నాయన లక్ష్మణ్‌రెడ్డి, నేదురు భాను నియమితులయ్యారు. ఎచ్చెర్ల మండలం సోషల్ మీడియా కన్వీనర్‌గా గవిరెడ్డి రవికుమార్, కో-కన్వీనర్లుగా బర్రి లక్ష్మణరావు, దుంప ఈశ్వరరావు, నక్క ఉమామహేశ్వరరావు నియమితులయ్యారు. దీనిలో భాగంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు.

ఎండలో వేచి ఉన్న ప్రయాణికులు

బస్సు టైరు పంక్చర్‌తో అవస్థలు

లావేరు : మండలంలోని జాతీయ రహదారి ఆదపాక కూడలి సమీపంలో టెక్కలి నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ఎక్స్‌ప్రెస్ టైర్ బుధవారం పంక్చర్ అయ్యింది. ఇందులో 50 మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. అదనపు టైరు లేకపోవడంతో రోడ్డుపైనే బస్సును నిలుపుదల చేశారు. ఈ సమయంలో వేరే బస్సులో ఎక్కించేందుకు ప్రయత్నించారు. అందులో షీట్లు ఖాళీ లేకపోవడంతో రోడ్డుపైనే గంట పాటు ప్రయాణికులు చిన్నారులతో వేచి ఉన్నారు. ఎండ వేడిమికి మరింత అవస్థలు పడ్డారు. హైవే పెట్రోలింగ్ అధికారులు స్పందించి ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి వేరే ఖాళీ బస్సును తప్పించారు. అనంతరం ప్రయాణికులను ఎక్కించి పంపించారు.



అవగాహన కల్పిస్తున్న బృందం

సకాలంలో జీతాలు చెల్లించాలి

ఇచ్ఛాపురం: హోటళ్ల, వివిధ ప్రయివేటు సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలని కార్మికశాఖ అధికారి సూర్యనారాయణ యజమానులకు సూచించారు. కార్మికశాఖ, రెవెన్యూ, పోలీస్, చైల్డ్‌లైన్, ఐసిడిఎస్ అధికారులు బృందం ఇటుక బట్టీలు, హోటళ్ల, సంస్థలను బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక చట్టాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్ట కూడదని ఆదేశించారు. 18 ఏళ్లలో పిల్లలకు ప్రమాదకర వృత్తిలో నియమించరాదన్నారు. రోజుకు 8 గంటలు పనిమాత్రమే చేయించాలన్నారు. సకాలంలో జీతాలు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో మానవ అక్రమ రవాణాశాఖ ఎస్ఐఎల్ వెంకటరావు, ఎఎస్ఐ రమణమూర్తి. పి.బాలకృష్ణ, సిహెచ్.సూర్య నారాయణ, కృష్ణబాబు, రామారావు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రంలో ఈ నెల 25,26 తేదీల్లో నిర్వహించనున్న ఐఎఫ్‌టియు రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దంత వెంకన్న పిలుపునిచ్చారు. శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం వద్ద గల నీలం జూట్ మిల్లు ఆవరణలో మహాసభల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక హక్కులు కలరాస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్లు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 25న ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో నిర్వహించనున్న ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిమ్మాడ రాము, జయరాం, డి.రాజారావు, పెంట వేణు, కోల ఆదినారాయణ, సనపల ఆదినారాయణ, గుండ వాసు, పూతి రాజారావు, ఎన్.రామారావు, పందిరి అప్పన్న, బీహార్ రమేష్, బొద్దం చిన్నారావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి- జలుమూరు

జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతను పాటించాలని ఎంఇఒ బమ్మిడి మాధవరావు అన్నారు. మండలంలోని మహమ్మద్‌పురం పాఠశాలను బుధవారం సందర్శించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథక అమలు తీరును పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ మాధవరావు

సంక్షిప్త వార్తలు

ఇంటి గోడ కూల్చివేత

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురం సచివాలయం-1 పరిధిలో లేఅవుట్-1 జగనన్న హౌసింగ్ కాలనీలో ఇంటి గోడను టిడిపి కార్యకర్త ఉప్పా రామారావు ఓర్వలేక కూల్చివేశారని లబ్ధిదారు దూపాన పూర్ణమ్మ బుధవారం విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. గోడని తన్ని తోసేసి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని బాధితురాలు ఆందోళన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా ఇల్లు నిర్మించకుండా అడ్డుపడుతున్నారని అన్నారు. బయపడి డబ్బులకు బేరానికి వస్తారనే ఇలా చేస్తున్నాడని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపిటిసి ప్రతినిధి నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్ అక్కడికి చేరుకొని పరిశీలించారు. ఏమైనా అభ్యంతరాలుంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని రామారావును కోరారు. దీనిపై రామారావు స్పందించి నేనెందుకు ఫిర్యాదు చేయాలని చెప్పడంతో ప్రేమ్‌కుమార్ యాదవ్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కూల్చివేసిన గోడ

రెడ్‌క్రాస్ భవనంలో పాము కలకలం

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని బాపూజీ కళామందిర్ ఎదురుగా ఉన్న రెడ్‌క్రాస్ భవనంలో బుధవారం నాగు ప్రవేశించడంతో కలకలం చెలరేగింది. అక్కడున్న వాషింగ్ మెషిన్‌లో పాము ఉందని గుర్తించిన సిబ్బంది గ్రీన్ మెర్సీ స్నేక్ హెల్ప్ లైన్‌కు సమాచారం ఇచ్చారు. గ్రీన్ మెర్సీ సిఇఒ రమణమూర్తి ఆధ్వర్యాన ఆ పామును పట్టుకుని నాగావళి నది ఒడ్డున గల పొదల్లో విడిచి పెట్టారు.

పామును పట్టుకున్న రమణమూర్తి

అప్పలనాయుడు పరామర్శ

లావేరు : మండలంలోని గోవిందపురం పంచాయతీ ఇజ్జడపాలెంకు చెందిన పతివాడ అప్పలనాయుడు అనారోగ్యంతో శ్రీకాకుళం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి నాయకులు లుకాలాపు అప్పలనాయుడు బుధవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈయన వెంట గోవిందపురం మాజీ సర్పంచ్ గొర్లె రామినాయుడు, ఇజ్జాడ రాము, వైసిపి సోషల్ మీడియా వారియర్ పతివాడ గురునాయుడు ఉన్నారు.

పరామర్శిస్తున్న అప్పలనాయుడు

ధాన్యం కొనుగోలుపై సభ్యుల ఏకరువు

మాట్లాడుతున్న తిలక్

ప్రజాశక్తి- నందిగాం

ఖరీఫ్ సీజన్‌లో పండించే ధాన్యం ఇప్పటికీ కొనుగోలు చేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పెద్దలమ్మనిపల్లి సర్పంచ్ అటార్ శ్రీనివాసరావు, సంజీవరావుతో పాటు పలువురు సభ్యులు ఏకరువు పెట్టారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన గురువారం మధ్యాహ్నం మండల సమావేశం నిర్వహించారు. అలాగే పక్క మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా పొలాల మధ్యలో ఉన్న రహదారుల నిర్మిస్తున్నారని, మండలంలో ఎందుకు చేపట్టడం లేదని ఎపిఒ నాగరాజును సర్పంచ్‌లు సంజీవరావు, శేషగిరిరావు, దిమ్మిడివరం, సభ్యులు రేగల లక్ష్మీకాంతం ప్రశ్నించారు. అంగన్వాడీ భవనాలు ఎప్పుడో పూర్తయ్యాయని, కానీ ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదని పలువురు సభ దృష్టికి తీసుకెళ్లారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ తిలక్ మాట్లాడుతూ అంగన్వాడీల భవనాల గురించి ఇప్పటికే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసి తక్షణమే ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో డిటి ఎం.భాగ్యలక్ష్మి, ఎంపిడిఒ హెచ్.పి.రమణమూర్తి, మండల ఇంజినీరింగ్ అధికారి సంతోష్‌కుమార్, నడుపూరు భానుమతి, పి.జయరాం పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి- పలాస

పలాస గౌతమ్ స్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన బుధవారం ఘనంగా ప్రపంచ కేన్సర్ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ కణితి విశ్వనాథం మాట్లాడుతూ చైతన్యం, ఆరోగ్య సూత్రలే కేన్సర్ రాకుండా నిరోధించవచ్చు అన్నారు. కార్యక్రమంలో బౌద్ధ భిక్షవు గౌతమ్ భంతి, డాక్టర్ కుమార్ నాయక్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎన్.అప్పారావు, సెక్రటరీ తమ్మినాన మాధవరావు, డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి, ఎల్.కొండలరావు, స్కూల్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ పాత్రో పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని లయన్స్ క్లబ్ ఆఫ్ పలాస క్యాషు ల్యాండ్ వనిత అధ్యక్షులు మల్లా జయశ్రీ అన్నారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం లయన్స్ క్లబ్ క్యాజు ల్యాండ్ వనిత, జెంట్స్ కేన్సర్ ఆస్పత్రి వైద్య బృందం సౌజన్యంతో అవగాహనా సదస్సు నిర్వహించారు. ముందుగా ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న వారికి మనోధైర్యం పెంచాలన్నారు. అనంతరం కేన్సర్ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రెటరీ తర్లన్న శ్వేతకుమారి, ట్రెజరర్ మల్లా సంతోషి, రీజనల్ చైర్ పర్సన్ నాటుకుల మోహనరావు, జోన్ చైర్మన్ సర్వేశ్వరరావు, డాక్టర్ ఎం.వెంకటరమణ, స్కూల్ హెచ్ఎం డి.తులసీరావు పాల్గొన్నారు.

మందులను పంపిణీ చేస్తున్న జయశ్రీ

రోడ్డు విస్తరణ పనులు పరిశీలన

పనులను పరిశీలిస్తున్న చైర్మన్ గిరిబాబు

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు బుధవారం పరిశీలించారు. కాశీబుగ్గ శ్మశానం ప్రాంతంలో క్రిష్టియన్ మత పెద్దలతో చర్చించి విస్తరణ పనులకు ఇబ్బందులు తలెత్తకుండా చొరవ చూపారు. అనంతరం శ్మశానం ప్రహరీని కూల్చి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఆ ప్రాంతంలో కాలువ పనులు చేపట్టారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, టౌన్ ప్లానింగ్ అధికారులు, క్రిష్టియన్ మత పెద్దలు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస మున్సిపల్ మెప్మా కార్యాలయంలో ఆర్‌పిలతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు సకాలంలో రుణాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, టిఎంసి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున జెసిఐ సభ్యులు

అమర జవానులకు నివాళి

శ్రీకాకుళం అర్బన్ : జెసిఐ శ్రీకాకుళం గ్రీన్ సిటీ అధ్యక్షులు మణిశర్మ ఆధ్వర్యాన అమరులైన ఆర్మీ జవానులకు బుధవారం నివాళ్లర్పించారు. 2019 పుల్వామా ఉగ్రదాడుల్లో అసువులు బాసిన అమరవీరులకు ఆర్మీ కాలింగ్ శిక్షణా కేంద్రంలో కొవ్వొత్తులతో వెలిగించి నివాళ్ల అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం కోసం, సంరక్షణ కోసం అహర్నిశలు శ్రమించి ప్రాణత్యాగం చేసిన సైనికుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో జెసిఐ సెనేటర్ మధుబాబు, వైస్ ప్రెసిడెంట్ మల్లేశ్వర రావు, లక్ష్మణరావు, గణపతి, జాడ సాయి, ఉమామహేశ్వరరావు, సతీష్ పాల్గొనాను.

మానవత్వం చాటుకున్న శ్యాంప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం : రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని ఓ మహిళ బుధవారం అపస్మారక స్థితిలో పడి ఉంది. దీనిని గమనించిన సీడ్ ఏపి చైర్మన్ సాధి శ్యాంప్రసాద్‌రెడ్డి స్పందించి వెంటనే 108లో ఆస్పత్రికి తరలించారు. ఈయన మానవత్వంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంబులెన్స్‌లో తరలిస్తున్న శ్యాంప్రసాద్‌రెడ్డి

అనాథ పిల్లలకు అండగా ఉంటాం

ప్రజాశక్తి- కవిటి

తల్లిదండ్రులను కోల్పోయిన నలుగురు అనాథలను జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ అక్కున చేర్చుకున్నారు. అన్ని విధాలుగా అండదండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మండలంలోని పెద్దమెలియపుట్టుగకు చెందిన తరని కామాక్షి, లక్ష్మన్ దంపతులు తీవ్రమైన అనారోగ్యానికి గురై ఇటీవల మృతి చెందారు. దీంతో వీరి సంతానమైన అనంత్, మేఘనాథం, దేవేంద్ర, మీన దిక్కులేనివారయ్యారు. విషయం తెలుసుకున్న ఇచ్ఛాపురం జనసేన నాయకుడు లోళ్ల రాజేష్ బుధవారం వారి ఇంటికి వెళ్లి చిన్నారులకు భరోసా ఇచ్చారు. భవిష్యత్‌లో అన్ని విధాలుగా అండదండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం నెలకి సరిపడే నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో ప్రశాంత్, పృథ్వీ, కుమార్, జనసేననాయకులు పాల్గొన్నారు.

సరుకులను అందజేస్తున్న రాజేష్